# బాపూ బొమ్మ - 5

కుంతలా...

ఇంతలా నీ ఆలోచనలు నా మనసును అతలాకుతలం చేయటం నిజంగా వింతగానే ఉంది! ఆరునెలల క్రితం ఏమాత్రం పరిచయం లేని కుంతలా అనే అమ్మాయి... నా జీవితంలోకి అడుగుపెట్టీ పెట్టగానే... మనసంతా ఆక్రమించేయటం ఏమిటో... నాలుగు రోజుల ఎడబాటుకే నేనింతలా తల్లడిల్లిపోవటం ఏమిటో... విడ్డూరమే!

ఎలాగో నాలుగురోజులు గడిచాయి. భోజనం చేసి వచ్చాక నీతో కబుర్లు చెప్పుకునే సమయాన్ని ఈ రోజు ఉత్తరం రాయటానికి ఉపయోగిద్దామని టేబుల్ ముందు కూర్చున్నానో లేదో 'కోడలుకి ఉత్తరం రాయరా...' అంటూ అమ్మ వచ్చి నా పక్కనే కూర్చుంది.

'పెళ్ళికి వెళ్తోందా, పట్టుచీరలు, నగలు తీసుకెళ్ళటం మర్చిపోయింది. ఎందుకో ఇందాక బీరువాతీసి చూస్తే తెలిసింది. ఆఫీసులో సెలవు ఇస్తారో, ఇవ్వరో అంటున్నావుగానీ, వెళ్ళక తప్పదు. వాటిని తీసుకెళ్ళటానికైనా వెళ్ళాలి. సెలవుకోసం మరి గట్టిగా ప్రయత్నం చేయాల్సిందే !'నీకు పెళ్ళి విషయం ఓ మాట చెప్పి వెళ్తే బావుంటుందేమో' అన్నా కోడలుతో. మీ అబ్బాయికి మీరే పంపించానని చెప్పండి... సరిపోతుంది. పెళ్ళయిన కొత్తలోనే 'మా ఇంట్లో మా అమ్మ ఎంత చెప్పితే అంత. అమ్మ ఇష్టప్రకారమే అన్నీ జరగాలి... 'అని మీ అబ్బాయి నాకు చెప్పారు. 'పెద్దవాళ్ళు బాగా ఆలోచించే చెబుతారు. నేనెందుకు కాదంటానూ... తూ.చా. తప్పకుండా పాటిస్తాను...' అని మాట ఇచ్చానపుడే. మీరు వెళ్ళమంటే మా మామయ్యతో వెళ్తాను' అంది. ఇక నేను మాత్రం ఏమంటాను. 'సరేలే...వెళ్ళు' అని చెప్పేసా. పుట్టింటికి ప్రయాణం అంటే ..ఆడపిల్లలకు ఎంత సంబరమో! చెంగున లేడిలా గెంతుతూ, బట్టలు సర్దేసుకుని మామయ్యతో ప్రయాణమై వెళ్ళిపోయింది. పిచ్చిపిల్ల... పెరట్లోవి, ఇంట్లోవి పనులంటూ హడావుడి పడుతోంటే, 'నేను చూసుకుంటాలే' అన్నాలే!'

అమ్మ నా ఎదురుగా కూర్చొని ఈ కబుర్లన్నీ చెబుతోంటే... 'చివరలో ఏం రాసావో చూస్తాను. ఇటియ్యి... ',అంటుందేమో అనుకున్నాగానీ, ఆ కాగితం కవరులో పెట్టటం చూసి 'రేపు పోస్టు చేసేయి... మర్చిపోకు' అంటూ నిద్రపోవటానికి వెళ్ళిపోయింది.

పిచ్చి అమ్మ! బట్టలు నువ్వు రాత్రే సర్దేసుకున్నావని తెలియదుగా మరి! పెళ్ళి కబురుతో పాటు, పిలుపుకి వచ్చే మీ మామయ్యతోనే నిన్ను ముందుగా పంపించమని ఆఫీసు అడ్రసుకు మీ నాన్నగారు నాకు ఉత్తరం రాసారనే విషయాన్ని అమ్మకు మనం చెప్పలేదుగా ! నువ్వు నీ పెట్టిలో పెట్టుకున్న పట్టు చీరల్ని, నగల్ని నేను ఎందుకు తీసేసానో ఇప్పటికైనా నీకు అర్థమైందా...? ఇంకో విషయం. ఆ పెట్టెలోనే నీ బట్టల అడుగున డబ్బు పెట్టాను. పెళ్ళికి కట్టుకోవటానికి కొత్త పట్టుచీర కొనుక్కో.

మాకు మీ వాళ్ళు పెళ్ళిలో, తర్వాత ఏవో లాంఛనాల పేరిట బట్టలు చాలానే పెట్టారుగా, ఇపుడు మీ చెల్లి పెళ్ళి సందర్భంలో మళ్ళీ బట్టలు పెట్టాలనుకునే కార్యక్రమం ఉంటే మాత్రం, నువ్వే ఏదో కారణం చెప్పి, కాన్సిల్ చేయించే బాధ్యత నీదే! వాళ్ళకిలాంటి అదనపు ఖర్చులు లేకుండా చేయగలగటమే ప్రస్తుతానికి

మనం చేయగల సహాయం. అవును కదూ...?

కుంతలా... నువ్వు నీ మాటల చమత్కారంతో అమ్మను బాగానే ఆకట్టుకుని, నీకిష్టమైనట్లుగా పనులు చేయించుకోగలుగుతున్నావ్! తెలివైనదానివే సుమా!

అంతేనా.. నీ సాంగత్యం, సాన్నిహిత్యం... మంత్రం వేసినట్లుగా నా జీవితాన్ని ఎంత మధురంగా మార్చాయో... నువ్వు దగ్గరగా లేని ఈ సమయంలో ఇంకా బాగా తెలుస్తోంది! అందుకే సహచరీ... నీకు ధన్యవాదాలతోపాటూ ఇంకో విన్నపమూ చేస్తున్నాను! నేను మాత్రమే కాదు, ఇంట్లో వాళ్ళంతా కూడా నువ్వు లేని వెలితిని అనుభవిస్తున్నారు. అందుకని నువ్వు కనికరించి... నీ ప్రయాణాన్ని వాయిదా వేయక, పెళ్ళి తర్వాత నాతోపాటుగా బయలుదేరి రావటానికి సిద్ధంగా ఉంటావు కదూ..?

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ కబుర్లు తెల్లవార్లూ కొనసాగుతాయి. ఇక ముగిస్తాలే.

– నీ వాడు

మధు.

ఉత్తరం చదవటం ముగించి అక్కతో ''ఏమిటోనే... ఈ ఉత్తరం కొత్తగా ఉంది! మీ అత్తగారి సంగతేమిటసలు... నాకు అర్థం కాలేదూ...'' అన్నా.

అక్క చిరునవ్వుతో చూసింది.

“మా అత్తగారి వేపు బంధువుల అబ్బాయిలు ఇద్దరు ముగ్గురు పెళ్ళి అవగానే వేరు కాపురాలు పెట్టారట! అందుకని కొడుకులు పెళ్ళికాగానే భార్య మాటలకు తలవగ్గుతారే తప్ప తల్లి దండ్రులను లెక్క చేయరనే అభిప్రాయం మా అత్తగారితో బాగా పాతుకుపోయిందట ! పెళ్ళికి ముందు కొడుక్కి పదేపదే ‘భార్య చెప్పిన దానికల్లా తలపూపకూడదు. అదే అలవాటయి వాళ్ళ మాటే చెల్లుబాటవుతుంది. అమ్మాయి స్వభావం ఎలాంటిదో తెలియకుండా ఇంటి పెత్తనం అప్పగించేయకూడదు. పెద్దల మాట వినాలి. వాళ్ళున్నంతకాలం వాళ్ళదే అధికారం అని అమ్మాయికి ముందే చెప్పు...’అని చెప్పేవారట అత్తగారు.

ఇపుడు చూడు మా నాన్న నీ పెళ్ళి విషయం ముందుగా బావకి ఉత్తరం రాసి చెప్పారని, మా అత్తగారు తనకి కదా ముందుగా చెప్పాలనుకుంటారేమోనని ఆ విషయం మావయ్య వచ్చేవరకూ మాకు తెలియనట్లే ఉండిపోయాం. అదీ సంగతి! అన్ని విషయాలు అత్తయ్య అనుమతితోనే చేసినట్లుగా నటిస్తాం అనుకోకు! నిజంగా ఆవిడ చెప్పినట్లు నడుచుకోవటంతో ఇబ్బంది కూడా ఏమీ ఉండదులే! ఒక్కోసారి మాత్రం అలా మభ్యపెట్టటం తప్పని అనిపించినా, ఆమెకి ఇష్టమైన..సంతృప్తి కలిగించే పద్ధతిలో నడుచుకుని సంతోషం కలిగించటమేకదా అని సరిపెట్టుకుంటాం!''

''అయితే మీ అత్తగారికి తన అధికారం కొనసాగాలనే తపనే తప్ప మనిషి మాత్రం చాలా మంచిదీ అంటావ్ ..అంతేనా...?'' అన్నా.

‘అవును’ అన్నట్లుగా తలపూపింది.

''మరి.. మరి.. పెద్దమ్మా వాళ్ళు నిన్ను నాలుగు రోజులపాటు ఉండటానికి పంపించమంటే, కుదరదని

మీ అత్తగారు అన్నట్లుగా చెప్పుకున్నారు కదే..?'' అనడిగా.

అక్క నవ్వింది.

''నిజం చెప్పనా? వీళ్లకి మా అత్తగారి మాటగా నేనే చెబుతానలా. ప్రయాణం మాట ఎత్తగానే ఆయన అలుగుతాడు... నేను కరిగిపోతా! రేపు నువ్వు కూడా అంతేలే.. వాళ్ళ ప్రేమకి దాసోహమైపోయి అన్నింటికీ తల వూపేస్తాం ! అదీ విషయం!'' అంటూ మళ్ళీ నవ్వింది.

నేనూ నవ్వుతూ ''నువ్వు అదృష్టవంతురాలివక్కా! మంచి అత్తగారు... అంతకు మించిన ఆయన...'' అన్నాను.

''నీకు మాత్రమేం తక్కువ! ఆ లెక్కన నువ్వింకా గొప్ప అదృష్టవంతురాలివి! నేనిక్కడకు రాగానే అమ్మా వాళ్లు... అబ్బో... నీ సంబంధం గురించి ఎంత గొప్పగా పొగిడేరో తెలుసా? మీ అత్తగారు ఎక్కి వచ్చిన బండి.. అందులో పరుపులతో భలే అట్టహాసంగా ఉందటగా...? ఇక ఆవిడ పెట్టుకున్న నగలు, కట్టిన ఖరీదైన చీర గురించి ఏం వర్ణించారనుకున్నావ్...? వాళ్ళంత ఐశ్వర్యవంతులు అయినా... నీ అందచందాలు, చదువు, తెలివితేటలూ గురించి విని, కట్న కానుకల ప్రసక్తే లేదంటూ నీ గురించి వచ్చారంటే... మీ అత్తగారిది ఎంత మంచి మనసో, నిన్నెంత గారంగా చూసుకుంటుందో ఆలోచించు! నీదంతా రాణీ వైభోగమే! ఇక ఆ అబ్బాయి కూడా... అప్పటి వరకు పెళ్ళి వద్దంటూ బెట్టుచేసినవాడు నిన్ను చూశాక 'సరే'నంటూ తల వూపేశాడని మీ కాబోయే అత్తగారే పెళ్లి చూపులనాడు చెప్పిందటకదా...! అయినా ముద్ద మందారంలా, ముగ్ధ మనోహరంగా ఉండే ఈ బాపూబొమ్మని ఎవరైనా కాదనగలరా..? ఆఖరుకు తపోనిష్ఠలో ఉన్న మునీశ్వరుడైనా సరే నీతో పెళ్ళి అంటే తల వూపేస్తాడు... తపస్సు, గిపస్సూ.. జాన్తానై.. అంటాడు!''

''ఛీ.. పో... అక్కా... ఏం మాట్లాడుతున్నావ్?'' అంటూ నేనూ నవ్వేశా.

ఎవరో తలుపు తడుతున్న శబ్దం విని అక్క వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా బాల!

లోపలికి వచ్చి ''తలుపు వేసుకుని మీరిద్దరూ ఏం చేస్తున్నారే...?'' అంది ఆరా తీస్తున్నట్టుగా.

''ఏదో మాట్లాడుకుంటున్నాం. నీకెందుకే...?'' అక్క కసిరింది.

అంత రహస్యాలు చెప్పుకుంటున్నారా? తలుపు వేసుకోవటం దేనికీ?'' నడుం మీద చేయి ఆనించి ఆరిందాలా అంది.

''అవును రహస్యాలే! నీలాంటి వాళ్ళు వచ్చి వినకూడదని. అవును గానీ బాలా... బావ ఉత్తరం చదవటమే కాకుండా అందరితో చదివించావు. మీరందరూ వడియాలు, అప్పడాల కర్ర అంటూ ఆట పట్టిస్తుంటే.. నేనూ సరదాగా నవ్వుకుని వూరుకున్నా. కానీ బాలా, ఇపుడే చెబుతున్నా... పెళ్ళికి బావ వచ్చినపుడు ఇలా పిచ్చిగా మాట్లాడితే బావుండదు !'' అంది చూపుడు వేలు చూపిస్తూ.

బాలా తల వూపుతూ ''అలాగే అక్కా... అప్పడాలు, వడియాల మాట అస్సలు ఎత్తను! అయితే బంతి భోజనంలో కూర్చున్నప్పుడు... నేనూ వడ్డనకు వెళ్తాగా, బావ ఏదైనా వద్దంటే మాత్రం 'నేనొల్లకోను. బావా...'

అంటానంతే!'' అంటూ ఫక్కున నవ్వి అక్కడ నుండి తుర్రుమంది.

''అబ్బా... ఇది ఓ గడుగ్గాయిలా తయారైంది ! అల్లరెక్కువ చేసేస్తోంది " అంది అక్క, నుదురు మీద చేత్తో కొట్టుకుంటూ.

అక్క మొహంలో కోపం కనిపించలేదు. నవ్వే ఉంది!

నేనూ నవ్వేశాను. ''పరవాలేదక్కా. బావతో అలా మాట్లాడదులే! ఉత్తరం తీసిందనే సంగతి పెద్దవాళ్ళకి తెలిస్తే.. కోప్పడతారని తనకీ భయం ఉంటుంది. ఏదో పిల్లల దగ్గరే ఇలా అల్లరి చేస్తుంటుందంతే...!''

''సరే పోనీయ్‌లే... బుల్లెమ్మాయ్. మీ అత్తగారింటికి వెళ్లాక నాకు మాత్రం తరచూ ఉత్తరాలు రాస్తూండాలి. మీది దగ్గర ఊరే కాబట్టి, నాలా కాకుండా ఎప్పుడంటే అప్పుడు వచ్చి ఒక రోజు అయినా ఉండి వెళ్లవచ్చు! నేను దూరంగా ఉంటాను కాబట్టి మీ అత్తగారి సంగతులన్నీ నాకు ఉత్తరం ద్వారానే తెలియాలి మరి! "

''ఉత్తరాలు రాయటం నాకు అలవాటు లేదు. చేతకాదనిపిస్తుంది!'' అన్నా.

''బావుంది. ఉత్తరం రాయటానికి చేతకాకపోవటమేమిటి... నీకేం చదువు రాదా?''

''అహ... అది కాదక్కా... బావ ఉత్తరం చూశానా, అలా అంత బాగా రాయటం అందరికీ చేతకాదని నా అభిప్రాయం...'' అన్నా నసుగుతున్నట్లుగా.

''బావలా నువ్వు రాయటం దేనికే..?" అంటూ నవ్వింది. ''నువ్వు చెల్లెలుగా మీ అత్తగారింటి కబుర్లన్నీ నాకు చెప్పాలి ! ఉత్తరం రాయటం చేతకాకపోవటం ఏముంటుంది? ఇపుడు నువ్వూ, నేనూ కూర్చుని చెప్పుకున్న కబుర్లనే కాగితం, కలం ద్వారా చెప్పుకుంటాం. అంతేగా...!'' అంది.

''అవునుగానీ బావ రాసిన ఉత్తరం అనవసరంగా నా మాటలకే చించేశావు కదూ.. ? నిజానికి నాకు ఆ ఉత్తరమే బాగా నచ్చింది!'' అన్నాను. మళ్ళీ నా పెదవులపైకి నవ్వు వచ్చింది.

అక్క నవ్వింది. ''ఆ ఉత్తరం నా తోపాటు పిల్లల గుంపుకీ కంఠతా వచ్చేసింది! అంతలా అందరి చేతులూ మారింది! ఇక ఎందుకులే అనుకున్నానంతే గానీ నువ్వన్నందుకు కాదులేవే!'' అంది.

అక్కతో కాసేపలా మాట్లాడాక మనసుకెంతో హాయిగా అనిపించింది! మనసులో ఏ మూలో ఉన్న ఆ కాస్త అలజడీ సద్దుమణిగింది !

★ ★ ★

ఒక్కొక్కరుగా బంధువులు రావటం.... పెళ్ళి కబుర్లు మొదలుపెట్టి ఐశ్వర్యం, అదృష్టం అంటూ మొదలుపెట్టడం.. ఎంత వద్దనుకున్నా పదే పదే అవే మాటలు చెవినబడుతూ విసుగు పుట్టించేస్తున్నాయ్!

అవన్నీ అయ్యాక ఆఖరున ''అబ్బాయి కూడా ఈడూ, జోడుగా బావున్నాడటగా' అని ఓ మాట అనటం! వాళ్ళ ఉద్దేశంలో అదేమంత ముఖ్యమైన విషయం కాదన్నట్లు ఉంది..ఏదో ఈడూ జోడూ కూడా కుదిరింది గానీ లేకపోతే దీని గురించి అనుకోవాల్సిన పనేం లేదన్నట్లుగా, వాళ్ళ మాటల తీరు ఉంది!

నాకు మాత్రం అత్తగారింట్లో ఎలా ఉండాల్సి వస్తుందోననే ఆదుర్దా తగ్గి, అక్కతో మాట్లాడాక, అతని

గురించిన ఆలోచనలు మొదలు అయ్యాయి!

ఎంత ఆలోచించినా ..పెళ్లిచూపుల నాడు... నా వేపు చిరునవ్వుతో చూసినట్లుగా గుర్తు రాలేదు.

మళ్లీ వెంటనే నాలో నేనే నవ్వుకున్నాను.

అసలు నేను చూసిందే ఒక సెకను సేపు. అలా చూసీ చూడనట్లుగా చూసి వెంటనే చూపులు క్రిందకి వాల్చేశాను. ఆ తర్వాత అతను చూశాడో, లేదో నాకెలా తెలుస్తుందీ ! అది ఎవరినైనా అడిగి తెలుసుకునే విషయమూ కాదుగదా!

అతనికేం సంకోచం ఉంటుందీ... బాగానే చూసి ఉంటాడు! లేకపోతే నచ్చానని వెంటనే అక్కడే ఎలా చెబుతాడూ? నా పెదవుల మీదకు అప్రయత్నంగా చిరునవ్వు వచ్చింది ! అతని రూపాన్ని ఊహలలోకి తెచ్చుకోవటానికి వీలే కావటంలేదు !

ఛ..! ఇంకోసారి మళ్లీ చూసి ఉంటే బావుండేది! ఎందుకంత మొహమాటపడ్డానో..! అసలు చూసుకోవటానికేగా 'పెళ్ళిచూపులు' అంటారు! మరి ఎందుకంత బిడియం...? నన్ను నేనే అలాంటి అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు మందలించుకుని... ఆ తర్వాత నా ఆలోచనలకు మళ్లీ నేనే లోలోపల నవ్వుకున్నాను.

ఇంకో పెదనాన్న గారి అమ్మాయి సుజాత అక్కకీ, సంవత్సరం నుండీ సంబంధాలు చూస్తున్నారు. ఏదీ కుదరలేదు. కట్నాల సమస్యే.

నా కంటే ఒక సంవత్సరం పెద్ద. అందుకే నాన్న 'సుజాతకి అయ్యాక బుల్లెమ్మాయి పెళ్లి చేయాలనుకున్నాం' అని వాళ్ళకి చెబుతానంటే, పెద్దమ్మా, పెదనాన్నా వీల్లేదని పట్టుబట్టారు.

''కట్నాల సమస్య లేదంటున్నారు. వాళ్లంతట వాళ్లే వస్తున్నారు. ఇపుడు కాదంటే మళ్ళీ కావాలనుకున్నప్పుడు ఇలాంటి సంబంధం దొరుకుతుందా.. ఈ రోజుల్లో ఇది పట్టించుకోవాల్సిన విషయం కానే కాదు. వచ్చే సంవత్సరానికి సుజాతకీ ఏదో ఒకటి కుదరకపోదు'' అంటూ నాన్నావాళ్లని ఒప్పించారు.

సుజాత అక్క పెళ్ళి చూపులనాడు ''కట్నం సమస్య లేకుండా నీకు పెళ్ళి ఇట్టే కుదిరిపోయింది! ఎంత అదృష్టమే...'' అంది.

నాకు ఎందుకోగానీ కొంచెం సిగ్గుగా అనిపించింది.

అవును... అక్కకి పెళ్ళి కాకుండా నేను ముందుగా చేసుకోవటం ఏమిటీ!

నాకు తెలియకుండానే తప్పు చేశానని అనిపించింది. అందుకే సంజాయిషీగా ''చదువుకోవాలని ఉందంటే వాళ్ళు ఒప్పుకోరని నాన్నా, నేనూ అనుకున్నాం. కానీ అదేమిటో ఆ వూరు నుండే కాలేజికి వెళ్ళి చదువుకోవచ్చంటే... ఇక ఏం మాట్లాడాలో తెలియక నాన్న సరే అనాల్సివచ్చింది. అయినా అక్కా... ఈ పెళ్ళీ, పిల్లలూ బాదరబందీ ఎప్పటికైనా తప్పదు.. నువ్వు చదువు మానెయ్యకుండా, చక్కగా కాలేజిలో చేరివుంటే బావుండేది ! చక్కగా చదువుకునే జీవితం మళ్ళీ కావాలంటే దొరకదుగా..! " అన్నా.

''సరేలే...'' అంటూ అక్కనవ్వింది. ''నేనయితే.. పెళ్లి తర్వాత చదువుకోమని వాళ్ళు అడిగితే, కుదరదని

ఖచ్చితంగా చెప్పేసేదాన్నే! ఇంకో రెండు సంవత్సరాలు చదివితే మాత్రం ఏమవుతుందీ.. ఉద్యోగమేం రాదుగదా? ఆ మాత్రం దానికి చదువూ.. చట్టుబండలూ అంటూ హైరానా దేనికి చెప్పు..? మనకి వంట,వడ్డనా అనేది తప్పదు! దానికోసం ఇంకా ఇంకా చదువుకోవటమనే తిప్పలు ఎందుకూ అనవసరంగా...? చదువుపట్ల నీకున్నంత ఇష్టం నాకు మొదటినుండీ లేదు. ఏదో ఇప్పటికి కష్టం మీద లాగించాను. ఇంకా పై ఊరు కూడా వెళ్ళి చదవాలా...? నా వల్ల కాదులే ! నా పెళ్ళితో అమ్మవాళ్ళకు కట్నం సమస్యయి కూర్చుందే అనే బాధ తప్పించి, చదువు అనవసరగా మానేసాననే బెంగ నాకేం లేదులే ! బాబాయ్ వాళ్ళకి ఆ సమస్య లేకపోయిందిగదాని, అదృష్టవంతురాలివని అన్నాలే!'' అంది.

నేను నిట్టూర్చి ఊరుకున్నాను.

మనుష్యుల ఆకారాల్లోనే కాదు, మనస్తత్వాల్లో, అభిరుచుల్లో తేడాలు ఉండటం సహజమేగా !

★ ★ ★

నేనేదో ఆలోచనలో పడ్డట్టుగా కూర్చుంటే... అమ్మ చూసి దగ్గరకు వచ్చి కూర్చుని " ఎందుకే అదోలా ఉన్నావూ...?'' అనడిగింది.

వెనకనే నాన్నమ్మా వచ్చి ఇంకో పక్కన కూర్చుని నా భుజం చుట్టూ చేయి వేసి " ఏమిటమ్మా... అమ్మానాన్నలను విడిచి వెళ్ళాలని బెంగపెట్టుకోలేదు కదా...?'' అంది.

వాళ్ళిద్దరూ అలా పక్కన కూర్చుని అంత ఆప్యాయంగా అడిగేసరికి అప్రయత్నంగా కళ్ళు చెమ్మగిల్లాయి. ఇక ఇద్దరూ ఒక్కసారిగా "ఏమిటమ్మలూ... ఎందుకే కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నావూ పిచ్చితల్లీ...!" అన్నారు.

అలా ఆదుర్దాగా అడిగేసరికి నాకు దిగులు పెరిగిపోయింది.

''మిమ్మల్ని వదిలి అక్కడ వాళ్ళింట్లో... ఎలా ఉండగలనే...!" అన్నా. ''వాళ్ళిల్లు ఏమిటమ్మా... ఇక నుండీ అదీ నీ ఇల్లే ! శకుంతలలా దూరం సంబంధం కాదు. ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు వచ్చేయవచ్చు. బండి కట్టించుకుని వస్తే... ఎంతా రెండు గంటల ప్రయాణం! ఎవరో ఒకరు వచ్చి చూసిపోతూనే ఉంటారు, నువ్వు ఓ కబురు చెబితే చాలు, మీ నాన్న వెంటనే వచ్చి నిన్ను వెంటబెట్టుకు రారూ... "అంది అమ్మ.

''అవునమ్మా. శకుంతల అత్తగారు దూరం అని చెప్పి పంపించదు గానీ నీకలా కాదుగా, దగ్గర ఊర్లోనే అదృష్టం కొద్దీ సంబంధం కుదిరింది. మేం మాత్రం నిన్ను చూడకుండా ఉండగలమా..? ఏదో కారణం వెతుక్కుని నిన్ను చూడటానికి వస్తాం, నిన్నూ పిలుచుకు వస్తాం!" అంది నాన్నమ్మ.

శకుంతల అత్తగారి ప్రసక్తి నాన్నమ్మ తేగానే, నాకు అక్క మాటలు గుర్తొచ్చి పెదవులపైకి చిన్న నవ్వు వచ్చేసింది!

''హమ్మయ్య ! నవ్వావుగా, ఇక బెంగ లేనట్లేనా..?'' అంది అమ్మ కూడా నవ్వు మొహంతో.

''అమ్మలూ... అక్కడ అచ్చట్లూ ముచ్చట్లతో హాయిగా ఉంటావు! ఇక్కడికి వచ్చినా గానీ, మా అత్తగారూ, ఆయనా వెంటనే వచ్చెయ్యమన్నారూ అంటూ నువ్వే ప్రయాణమైపోతావు! నిజం చెప్పాలంటే.. నువ్వు వెళ్ళిపోతే ఇల్లంతా బోసిపోతుంది! కళే ఉండదు ! ఎలా ఉండాలా అని మేం దిగులు పడుతున్నాం! "

అంది నాన్నమ్మ. గొంతు కూడా గద్గదమయింది.

నేను నాన్నమ్మ వేపు ఆశ్చర్యంగా చూసాను.

శకుంతలక్క మాటల్లోని భావం కూడా అదేగా ! ఇదేమిటి...అమ్మాయిలంతా అలా మారిపోతారా...?

నాకు మళ్ళీ నవ్వొచ్చింది! వాళ్ళిద్దరూ కూడా ప్రాణాలు కుదుటపడినట్లుగా నావేపు కులాసాగా చూశారు.

''సుగుణమ్మ పిన్నివచ్చింది. నువ్వెక్కడా అని అడిగితే పిలుచుకు వెళ్దామని వచ్చా... "అంది అమ్మ.

"అవును... పెరట్లో వంట వాళ్ళదగ్గర చతికిలబడింది. అపుడే వాళ్ళకేవో సూచనలు ఇచ్చేస్తూ పురమాయింపులు మొదలు పెట్టేసింది. ఇక వంటల సంగతి ఎవ్వరూ పట్టించుకోనవసరం లేదు. అన్నీ తానే చూసుకుంటుంది. మనకి ఇదో నిశ్చింత! " అంది నాన్నమ్మ. నేనూ లేచి వాళ్ళ వెనకే వెళ్ళాను.

పిన్ని నన్ను చూస్తూనే నవ్వుమొహంతో " రావే పెళ్ళికూతురా... గదిలో కూర్చుని ఏం చేస్తున్నావ్? ఇదిగో ఈ నాలుగురోజులూ నా పక్కనే ఉండు. రుచిగా, శుచిగా వంటలు ఎలా చేయాలో కిటుకులన్నీ నేర్పిస్తాను. 'ఇంత బాగా చేస్తున్నావ్... ఎవరి దగ్గర నేర్చుకున్నావ్ ?'అని మీ అత్తగారు వాళ్లు అడిగితే నా పేరే చెప్పాలి సుమా...! " అంటూ పెద్దగా నవ్వింది.

నేనూ చిరునవ్వుతో పక్కనే కూర్చుని'' విశేషాలు ఏమిటి పిన్నీ...? అని యధాలాపంగా అడిగాను.

''ఏముందే...నీపెళ్ళి పెద్ద విశేషవార్త అయి కూర్చుంది. ఇంత తొందరగా నువ్వు పెళ్ళి కూతురివైపోతావని అనుకోలేదే! " అంటూ మళ్ళీ నవ్వింది. పిన్ని మాట మాటకీ నవ్వుతూనే ఉంటుంది. ఆ నవ్వుకేనేమో పిన్ని దగ్గర కాసేపు కూర్చుంటే చాలు, మనసు ఆహ్లాదంగా ఉంటుంది.

పిన్ని కబుర్లు చెబుతూనే వంట చేస్తున్నవాళ్ళ దగ్గరికి తిరుగుతూ ఏమేం వేశారో అడగటమే కాదు, స్వయంగా రుచి చూసి ఉప్పు, కారాలు ఇంకా కలపాల్సివుంటే చెబుతోంది!

మధ్య మధ్యలో నాతో కబుర్లు చెబుతూనే ఉంది. అందరిలాగే పిన్ని కూడా మా అత్త గురించి అదేపాట పాడింది గానీ, ఒక కొత్త మాటనూ చేర్చింది. "కట్నం అడగనందుకు అందరూ 'ఎంత మంచి మనసో ఆవిడది'.. అంటున్నారు కానీ , మీ అత్తగారు చాలా తెలివైనదే.. "అంది పిన్ని.

''ఎందుకనీ...?'' కొంచెం ఆశ్చర్యంగా అడిగా.

''వాళ్ళకే కట్టుకుపోయేంత ఆస్తి ఉందా, ఇంకా కట్నంతో వచ్చే కోడలు కంటె... మనలా కుటుంబాల్లో ఒద్దికగా పెరిగిన బుద్ధి వంతురాలైన అమ్మాయి అయితే, చక్కగా కలిసిపోయి పెద్దల పట్ల వినయవిధేయతలతో మెలుగుతూంది అని ఆలోచించి ఉంటుంది. అలాంటి తెలివైన నిర్ణయం తీసుకుందనీ..." అంది.

''పిన్నీ.. కట్నాలు ఇవ్వలేని వాళ్ళంతా అణకువగా ఉంటారా. కట్నాలు తెచ్చిన అమ్మాయిలు పెడసరంగా ప్రవర్తిస్తారా...? వాళ్ళవాళ్ళ మనస్తత్వాన్ని బట్టి ప్రవర్తన ఉంటుందని నాకనిపిస్తోంది అన్నా.

''నువ్వన్నదీ నిజమేనేవ్ ! కాకపోతే అలా అరుదుగా ఉంటారు. సాధారణంగా జరిగే సంగతి నేను చెప్పాను...'' అంది.

“అవును.. నువ్వన్నదీ నిజమే పిన్నీ.. అలాంటి వాళ్ళు అరుదుగానే ఉంటారు..” అని, “ నువ్వు వంట చేసినా, నీ పర్యవేక్షణలో చేయించినా ఎందుకంత రుచిగా వంటకాలు ఉంటాయో నేను కనిపెట్టేశాగా... “అంటూ నవ్వాను.

‘‘ఏమిటో చెప్పు ఆ కిటుకు...’’ పిన్ని అడిగింది.

‘‘నువ్వు పూర్తిగా వేరే వాళ్ళకు వదిలేయకుండా స్వయంగా చూస్తుంటావు. ఆసలు ఏ పని అయినా ఇష్టంగా, శ్రద్ధగా చేయటమే విజయరహస్యం...! అవునా...? “అన్నా.

పిన్నీ సరదాగా నవ్వి ‘‘నిజమే...’’ అంటూ ఆప్యాయంగా భుజం చుట్టూ చేయి వేసింది.

★ ★ ★